సాక్షి ఒడిశా

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,89,853లు, బంగారం 11.65 గ్రాములు, వెండి 100 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కొరడా

● జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ

- 10లో▸



అపోహలు వీడండి

- 10లో▸

న్యూస్‌రీల్

చెరువులో మునిగి చిన్నారి మృతి



చిన్నారి మృతదేహాన్ని పట్టుకొని రోదిస్తున్న తల్లి

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితిలో చెరువులో మునిగి, రెండేళ్ల చిన్నారి మృతిచెందింది. ఛంపఖారి గ్రామానికి చెందిన హేమంత్ హంతాల్, అతని భార్య ఏదో పనిలో ఉండగా.. అప్పుడే నిద్రలేచిన వారి కుమార్తె శుభం హంతాళ్(2) తన ఇంటి సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి, నీటిలో మునిగిపోయాడు. కొంత సేపటికి ఇంట్లో చూసుకున్న తల్లిదండ్రులకు బిడ్డ కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఇంతలో చెరువులో చిన్నారి తేలుతున్నట్లు గుర్తించిన చుట్టుక్కల వారు కేకలు వేయడంతో ఒడ్డుకు చేర్చి, మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో, సిబ్బందితో కలిసి ఆస్పత్రికి చేరుకున్నారు. మృతిపై వివరాలు తెలుసుకొని, కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

బైక్ దొంగలు అరెస్ట్



పోలీసుల అదుపులో బైకులు, నిందితులు

బరంపురం: జిల్లా పోలీసు అధికారులు వివిధ ప్రాంతాల్లో దాడులు చేపట్టి, చోరీకి గురైన 18 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు వివరాలను బరంపురం జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సరవణ్ వివేక్ వెల్లడించారు. జిల్లా పరిధిలో గత కొద్ది రోజులుగా చోటు చేసుకున్న బైక్ దొంగతనాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా దోపిడీ ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని, విచారించారు. వారి నుంచి 18 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారు ఖుర్దా జిల్లాకు చెందిన గొలమ్ హుసన్‌ఖాన్, గంజాం జిల్లాకు చెందిన లిల్లు బెహరా, ప్రశాంత్ పాత్రో, శిబశంకర్ సాబత్, సమీర్ బిశాయిగా గుర్తించారు.


గుణుపూర్ సబ్ కలెక్టర్‌కు అస్వస్థత



లలిత్‌కుమార్ కుహోరొ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లలిత్‌కుమార్ కుహోరొ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం గుండెపోటుకు గురవ్వడంతో వెంటనే ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. కొద్ది రోజులు విశ్రాంతి తీసుకున్న అనంతరం విధుల్లో చేరతారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

210కిలోల గంజాయి సీజ్



పట్టుబడిన గంజాయితో నిందితులు, పోలీసులు

బరంపురం: జిల్లాలోని దిగపండి నుంచి కారులో బరంపురం తరలిస్తున్న 210కిలోల గంజాయిని శుక్రవారం సాయంత్రం అధికారులు సీజ్ చేశారు. ముందుగా అందిన సమాచారం ప్రకారం కుకుడాఖండి–బరంపురం మూడు రోడ్ల జంక్షన్‌లో గస్తీ చేపట్టారు. అటుగా వస్తున్న కారుపై దాడి చేయగా, 9 బస్తాల్లో 210కిలోల గంజాయి పట్టుబడింది. జిల్లాలోని అస్కాకు చెందిన అంతర్యామి దాస్, సత్యజిత్ గొంతాయత్, హరేకృష్ణ నాయక్‌ను నిందితులుగా గుర్తించి, అరెస్ట్ చేశారు.

జాతీయ రహదారులే.. దేశాభివృద్ధికి సోపానాలు

- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా
- రాష్ట్రంలోని వివిధ జాతీయ రహదారి ప్రాజెక్టుల ప్రారంభం
- గత 9 ఏళ్లలో రూ.18 లక్షల కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడి
- సహకార సమాఖ్య వ్యవస్థ మా సంప్రదాయం: సీఎం నవీన్



జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రారంభిస్తున్న అమిత్ షా, సీఎం నవీన్



ప్రసంగిస్తున్న హోంశాఖ మంత్రి అమిత్ షా

భువనేశ్వర్: దేశ భవిష్యత్, అభివృద్ధి జాతీయ రహదారులతో ముడిపడి ఉందని కేంద్ర హోం వ్యవహారాలు, సహకార శాఖామంత్రి అమిత్ షా అన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో కలిసి రాష్ట్రంలోని పలు జాతీయ రహదారి ప్రాజెక్టులను ఆయన శనివారం ప్రారంభించారు. కలహండి జిల్లా లడుగాంవ్ మీదుగా మోటర్–బ్యానర్ రోడ్డు విస్తరణ, బలోపేతం కార్యకలాపాలు పురస్కరించుకుని శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా 53వ నంబర్ జాతీయ రహదారి కామాఖ్యనగర్–డుబురి సెక్షన్ 4 అంచెల రహదారిని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా షా మాట్లాడుతూ... 51 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.761 కోట్లు వెచ్చించిందన్నారు. జాజ్‌పూర్ కళింగ నగర్‌లోని స్టీల్‌హబ్, తాల్చేర్ కోల్‌బెల్ట్ ప్రాంతాలకు ఈ రహదారి అనుసంధానించనున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుందని పేర్కొన్నారు. రోజుకు సగటున 29కిలోమీటర్ల పొడవు రహదారులు నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. కేంద్రప్రభుత్వం గత 9 ఏళ్లలో వివిధ రంగాల్లో ఒడిశాకు రూ.18 లక్షల కోట్ల గ్రాంట్లు మంజూరు చేసిందని వెల్లడించారు.

రాష్ట్ర ప్రయోజనాలే కీలకం..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ నవ ఒడిశా వివిధ రంగాల్లో ప్రత్యేకమైన పరివర్తనతో సరికొత్త విజయ గాథ ఆవిష్కరిస్తుందన్నారు. రాష్ట్రప్రజల సాధికారతకు అనుసంధానమే కీలకమని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. మల్కన్‌గిరిలోని స్వాభిమాన్ ప్రాంతాన్ని కలిపే గురుప్రియ వంతెన దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ వంతెన నిర్మాణం ఆ ప్రాంత సమగ్ర అభివృద్ధిలో గుర్తించదగ్గ పాత్ర పోషించిందన్నారు. బిజూ ఎక్స్‌ప్రెస్ వే-పశ్చిమ ఒడిశాను దక్షిణ ఒడిశాతో కలిపే ఆర్థిక కారిడార్‌గా ఉభయ ప్రాంతాల వృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి కీలకమైన వేదికగా వెలుగొందుతుందని ఆనందం వ్యక్తంచేశారు. రాష్ట్ర నిర్మాణశాఖ బడ్జెట్ 2000నుంచి నిరవధికంగా పరిమాణం వృద్ధి చేసుకుంటూ ప్రగతి సాధిస్తుందన్నారు. ఈ క్రమంలో బడ్జెట్ కేటాయింపులు దాదాపు రూ.280 కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పైగా పెరిగినట్లు వెల్లడించారు. ఈ ఏడాది 6,500 కిలోమీటర్ల రోడ్లను మెరుగుపరిచి, 300 వంతెనలను నిర్మించాలని యోచిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో 2 విమానాశ్రయాల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. మల్కన్‌గిరిలో మరో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణ దశలో ఉందని వివరించారు.

ప్రాణహాని, మావోయిస్టులు తగ్గుముఖం..

రాష్ట్రంలో విపత్తు నిర్వహణ పురస్కరించుకుని సీఎం నవీన్ నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వ కార్యాచరణను అమిత్ షా ప్రశంసించారు. విపత్తు నిర్వహణలో ఒడిశా దాదాపు శూన్య ప్రాణహాని సాధించడం అభినందనీయమన్నారు. ఒడిశా విపత్తు నిర్వహణ నమూనా.. జాతీయ విపత్తు నిర్వహణలో కీలకపాత్ర పోషించిందన్నారు. అలాగే ఒడిశాలో మావోయిస్టుల బెడదను తగ్గించడంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను కొనియాడారు. వామపక్ష తీవ్రవాదం(ఎల్‌డబ్ల్యూఈ) పరిస్థితులను సమీక్షించిన ఆయన, 2015 నుంచి 2019 వరకు మావోయిస్టుల దాడులు 30శాతం తగ్గుముఖం పట్టాయన్నారు. ఎదురు కాల్పులు 32శాతం, భద్రతా సిబ్బంది మరణాలు 56శాతం తగ్గాయని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను భారీ స్థాయిలో నియంత్రించి, వామపక్ష తీవ్రవాదం అణచివేత బలం పుంజుకుంటుందన్నారు. ఈ కార్యకలాపాల్లో రాష్ట్రప్రభుత్వం ఎల్లప్పుడూ కేంద్రానికి మద్దతు ఇస్తోందని వివరించారు.

కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

రాష్ట్రం సహకార ఫెడరలిజాన్ని విశ్వసిస్తుందని సీఎం నవీన్ తెలిపారు. అభివృద్ధి అజెండాలో రాష్ట్రానికి మద్దతు ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత 23ఏళ్లలో రాష్ట్రం చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రాష్ట్ర నిర్మాణశాఖ మంత్రి ప్రఫుల్లకుమార్ మల్లిక్ ఈ సందర్భంగా వివరించారు. రౌర్కెలా నుంచి అంపణి వరకు బిజూ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం దాదాపు పూర్తి కావస్తుందన్నారు. ఈ ప్రాంతం ఆర్థిక పరివర్తనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి పూర్వోదయ దార్శనికత రూపంలో కేంద్రప్రభుత్వం తూర్పు రాష్ట్రాలపై దృష్టి కేంద్రీకరించిందన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం కేంద్రం ఒడిశాకు గణనీయంగా నిధులు కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా అతిథులకు స్వాగతం పలకగా, జాతీయ రహదాలరు సంస్థ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల భారీ ర్యాలీ



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యయులు



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాయగడ: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించాలని, లేని పక్షంలో ఆగస్టు 16నుంచి సామూహికంగా విధులు బహిష్కరిస్తామని జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం హెచ్చరించింది. ఈ మేరకు పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులు.. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించారు. ప్రాథమిక విద్యా వ్యవస్థలో గుత్తేదారుల పద్ధతిని తొలగించాలని, అదేవిధంగా గ్రేడ్-పే కింద రూ.4,200ల వేతనాన్ని మంజూరు చేయాలన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ పద్ధతిని కొనసాగించాలని విన్నవించారు. ప్రాథమిక పాఠశాలల్లో సాంస్కృతిక, క్రీడా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని కోరారు. డిమాండ్లకు సంబంధించి గత ఏడాది నవంబరు 30న ఉపాధ్యయులంతా కలిసి ఆందోళన చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు సదానంద నాయక్ ప్రకటించారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



జొడియా వీధిలో పర్యటిస్తున్న వైద్యాధికారులు

రాయగడ: వర్షాకాలంలో సంభవించే వివిధ రోగాలపై ప్రజలు అప్రమత్తతగా ఉండాలని, దీనికి సంబంధించి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య బృందం సూచించింది. కాసీపూర్ సమితి టికిరిలోని జొడియా వీధి తదితర ప్రాంతాల్లో శనివారం వైద్యాధికారులు పర్యటించారు. గత ఏడాది ఈ ప్రాంతాల్లో వర్షాకాలంలో డయేరియా సోకడంతో ఎంతోమంది మృతిచెందగా, రోగాల బారినపడి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన డాక్టర్ మమత దాస్ నేతృత్వంలో జ్ఞాన సాహు, కాసీపూర్ సీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ నేత్రానంద నాయక్, సిబ్బంది జొడియా వీధిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గత 4రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఉండే ఆహారాన్ని తినాలని, అనారోగ్యంగా ఉంటే నిర్లక్ష్యం లేకుండా సమీపంలోని వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

పరిశోధనకు మేధో సంపత్తి ఆధారం

- భువనేశ్వర్ ఐఐటీలో మేధో సంపత్తి హక్కులు–ప్రాథమిక అంశాలపై సదస్సు



ప్రసంగిస్తున్న ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ ఆర్‌పీ సింగ్

భువనేశ్వర్: 'పారిశ్రామిక విస్తరణకు అనుగుణంగా విద్యార్థులకు మేధో సంపత్తి హక్కుల పట్ల అవగాహన కల్పించడం అవసరం. సంప్రదాయ విద్యాభ్యాసంతో పోటీ ప్రపంచంలో ఉనికి బలపరచుకోవడం కష్టతరం. అధునాతన, సృజనాత్మక చైతన్యంతో యువత ముందుకు సాగాల్సి ఉంద'ని ప్రముఖులు పిలుపునిచ్చారు. భువనేశ్వర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లో మేధో సంపత్తి హక్కులు–ప్రాథమిక అంశాలు అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహక సంస్థ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ ఆర్‌పీ సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఇందులో బోర్డు ఆఫ్ గవర్నర్స్ సభ్యుడు ప్రశాంతకుమార్ స్వాయి, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ కర్మల్కర్, రిజిస్ట్రార్ వామ్‌దేవ్ ఆచార్య, ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(మేధో సంపత్తి హక్కులు) ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ గౌరవ్ భర్తర్యా హాజరయ్యారు. అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులకు మేధో సంపత్తి హక్కులపై ప్రాథమిక అవగాహన కల్పించడం ఈ శిబిరం లక్ష్యంగా వక్తలు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ రంగంలో విద్యాభ్యాసం పొందుతున్న భావి ఇంజినీర్లకు సరికొత్త దృక్పథంతో నడిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమ ఆధారిత పరిశోధన, ఆవిష్కరణల అభివృద్ధికి ఈ ప్రయత్నం దోహదపడుతుందన్నారు. కోల్‌కతా వాణిజ్యశాఖ పేటెంట్స్, డిజైన్ భాగం అసిస్టెంట్ కంట్రోలర్ కుందన్‌కుమార్, ఖురానా లా సంస్థ డైరెక్టర్, భాగస్వామి, ఐపీ అటార్నీ టీఎస్ సారథ్ తదితరులు ప్రసంగించారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

స్థల పరిశీలన

జయపురం: పట్టణంలోని విక్రమదేవ్ విశ్వవిద్యాలయం నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యా విభాగం నుంచి ముగ్గురు అధికారులు స్వతంత్ర కమిటీ జయపురాన్ని సందర్శించి, అనువైన స్థలాలను పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో 5, 6 స్థలాలను ప్రతిపాదించారు. వీటిపై జిల్లా కలెక్టర్‌తో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ప్రాంతీయ విద్యాశాక డైరెక్టర్ డాక్టర్ త్రినాథ్ రథ్ వెల్లడించారు. కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యశాఖ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ అశోక్‌కుమార్ దాస్, అకాడమిక్ అధికారి ప్రొఫెసర్ మిహిర్‌కుమార్ దాస్, ఉన్నత విద్యావిభాగం కార్యదర్శి రమాకాంత నాయక్ ఉన్నారు. పరిశీలనలో జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, తహసీల్దార్ సాగరాక షొడంగి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రథ్, విక్రమదేవ్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ గోపాల హల్దార్, రెవెన్యూ సూపర్‌వైజర్ హరిహర శత్పథి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరేన్ చలాన్, రొండాపల్లి ఆర్‌ఐ జ్యోత్స్న రాణి పాఢి, అంబాగుడ ఆర్‌ఐ ధన ముదులి, జయంతిగిరి ఆర్‌ఐ మహేశ్వర సామంతరాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓఎస్‌డీగా ప్రొఫెసర్ దేవీప్రసాద్

జయపురం: పట్టణంలోని విక్రమదేవ్ యూనివర్సిటీకి స్పెషల్ డ్యూటీ ఆఫీసర్‌గా నియమితులైన ప్రొఫెసర్ దేవీప్రసాద్ మిశ్రా బాధ్యతలు స్వీకరించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాకు చెందిన దేవీప్రసాద్‌కు ఈ పదవి దక్కడంపై వర్సిటీ సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయ ప్రథమ అడ్మినిస్ట్రేటర్‌గా ఇదే ప్రాంతానికి చెందిన వ్యక్తి నియమితులు కావడంతో ఎంతో గర్వంగా ఉందని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి రమాకాంత నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సుధాకర పట్నాయక్, ధర్మేంద్ర అధికారి, రాజేంద్ర గౌఢ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



ఛెలిగడ శిబిరంలో మాట్లాడుతున్న వెంకటరమణ



నారాయణపూర్‌లో శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లకు 'ఉత్కర్ష' పేరిట ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. రాయఘడ సమితి నారాయణపూర్ ఎస్‌ఎం ఉన్నత విద్యాలయంలో కె.వెంకటరమణ, ఆర్.ఉదయగిరి ఛెలిగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ అంపోలు రవికుమార్ దీనిని ప్రారంభించారు. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒడియా, ఇంగ్లీషు, గణితం, సైన్సు సబ్జెక్టులకు సంబంధించి గుణాత్మక విద్యను అందించేందుకు ఈ శిక్షణ ఉపయోగ పడుతుందని కో–ఆర్డినేటర్ తెలిపారు. శిబిరంలో శిక్షకులుగా వై.ధర్మారావు, ప్రఫుల్లకుమార్ బొరాడో, జ్యోతిప్రసాద్ పాత్రో, విఘ్నేశ్వర సాహు, శివకల్యాణి ఆచార్య, సబితా కుమారి దాస్, రాజలక్ష్మీ రైతో, సుజ్ఞానిప్రభా పాణిగ్రాహి వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: ట్రాఫిక్ నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. హెచ్‌ఎం శ్యామ మెహరా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు హవాల్దార్ చులధ్వజ బెహరా, కానిస్టేబుల్ ప్రదీప్‌కుమార్ గౌడ పాల్గొని, మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించక పోవడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారుల్లో ప్రయాణించే వారు విధిగా సీటు బెల్ట్ వినియోగించాలని, మత్తు పదార్థాలు, అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ఇతరులకు కూడా హాని కలిగిస్తామని వివరించారు. జూనియర్ రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ శుభస్మిత దాస్, జిల్లా అధికారి యజ్ఞేశ్వర పండా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విశ్వరంజన్ గౌడ, ఉపాధ్యాయులు కె.ప్రమీల, రస్మిత సహూ, ప్రభాతి పాణిగ్రహి, సాగరిక పాత్రో, బణిత శత్పతి, సువర్ణకుమారి ఖిలో, సుధా పట్నాయక్, నరేష్‌కుమార్ షొడంగి మాట్లాడారు.

క్లుప్తంగా

కేజీహెచ్‌కు వెళ్లి.. పింఛన్ అందించి..



సీతమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తవిటిబాబు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని భగీరథపురం గ్రామానికి చెందిన తంగి సీతమ్మ అనే దివ్యాంగురాలు అనారోగ్యంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. పింఛన్ తీసుకునేందుకు ఐదో తేదీ చివరి రోజు కావటంతో గ్రామ వలంటీర్ సి.హెచ్.తవిటిబాబు శనివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. వలంటీర్‌ను గ్రామ కార్యదర్శి రాజేశ్వరి, సాంక్షేమ విద్యా సహాయకులు వెంకటలక్ష్మి అభినందించారు.

మీ భవిత మా బాధ్యత

శ్రీకాకుళం రూరల్: ఐటీసీఎల్ పైప్‌లైన్‌కు భూములిచ్చిన రైతుల పిల్లల భవితను తీర్చిదిద్దడం తమ బాధ్యతని ఐటీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్‌కుమార్ వాసుదేవన్ అన్నారు. శనివారం రాగోలు జెమ్స్‌లో బొల్లినేని మెడిస్కిల్‌ను సందర్శించారు. ముందుగా విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్న ఫార్మసీ అసిస్టెంట్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. రైతులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి పిల్లలకు ఉజ్వల భవిష్యత్ కల్పించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పట్నాయక్, ఆపరేషన్ చీఫ్ మేనేజర్ డీవీఎస్‌రావు, ఆపరేషన్ సీజీఎం అలోక్ సాహు, టాస్క్ డిప్యూటీ మేనేజర్ భాస్కర్, బొల్లినేని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పది రోజుల్లో ఆరో సెమిస్టర్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు ఉన్నత విద్యకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఇబ్బంది లేకుండా పది రోజుల్లో డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎక్కువగా ఆరో సెమిస్టర్ ఫలితాలపై ప్రశ్నించారు. మూల్యాంకనం పూర్తి చేసినట్లు అధికారులు చెప్పారు. ఇయర్ ఎండ్ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు కొందరు అధికారులు దృష్టికి తెచ్చారు. ఈ ఏడాది నిర్వహణ ఉండదని, భవిష్యత్‌లో ప్రకటన విడుదల చేస్తామని అన్నారు. రీవాల్యుయేషన్‌పై, ఐదో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ మార్కుల జాబితాలపై విద్యార్థులు ప్రశ్నించారు. పోలాకిలో ఒక ప్రైవేట్ బీఎడ్ కళాశాల నిబంధనలు మేరకు నిర్వహించటం లేదని కాల్ రాగా పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, రీవాల్యుయేషన్ డీన్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

- అధికార లాంఛనాలతో దహన సంస్కారాలు



గోపాల్ భార్యత్రివేణికు జాతీయ జెండా అందజేస్తున్న ఆర్మీ అధికారులు



నందిగాం: మండలంలోని నౌగాంకు చెందిన గోపాల్ పాత్రో(35) జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీ హవల్దార్ క్లర్క్‌గా పని చేస్తూ ఈ నెల 3న గుండెపోటుతో మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుంటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత్రో మాధవరావు, అన్నపూర్ణల కుమారుడు గోపాల్ 2006లో ఆర్మీలో చేరి ప్రస్తుతం జమ్మూలో విధులు నిర్వహిస్తున్నారు. భార్య త్రివేణి, ఇద్దరు పిల్లలు మోక్షిత్, వేదశ్రీతో కలిసి జమ్మూలోనే నివాసం ఉంటున్నారు. గురువారం యదావిధిగా ఇంటి నుంచి విధులకు వెళ్లారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అధికారులు విషయాన్ని భార్యకు తెలియజేసి మృతదేహాన్ని స్వగ్రామమైన నౌగాంకు శనివారం తీసుకుచ్చారు. ఆర్మీ ఉన్నతాధికారులు గోపాల్ భార్యకు జాతీయ జెండా అందించి గార్డ్ ఆఫ్ హానర్ అందించారు. గోపాల్ తండ్రి మాధవరావు గతంలోనే మరణించగా, తల్లి అన్నపూర్ణ కుమారుడు మృతి చెందాడనే విషయం తెలిసి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కొరడా

- జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ వివేకానంద శర్మ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

రాయగడ: అత్యధి శాతం రోడ్డు ప్రమాదాలు మద్యం తాగి వాహనాలను నడపడం కారణంగానే జరుగున్నాయని జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ విచారం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కింద తనిఖీలు ముమ్మరం చేసి, కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తరచూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 4న జిల్లాలో 31 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, దీనికి సంబంధించి 26 ద్విచక్ర వాహనాలు, 2 లారీలు, 2 పికప్ వ్యాన్‌తో కారును సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి జిల్లా పోలీస్ యంత్రాంగం, ఆర్‌టీఓ సిబ్బంది తరచూ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాలను నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ద్విచక్ర వాహనాల నడిపే సమయంలో హెల్మెట్లు ధరించడం వంటివి తూచా తప్పకుండా పాటించాలన్నారు. యువత అతివేగంగా వాహనాలను నడిపి, రోడ్డు ప్రమాదాల బారినపడి తమ బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు నడిపే అవకాశం కల్పించకూడదన్నారు. చట్టరీత్యా నేరంగా పరిగణించే ఈ ప్రక్రియకు స్వస్థి పలకాలని పిలుపునిచ్చారు. అందరి సహకారంతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.

తనిఖీలు ముమ్మరం..

హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపే వారిపై కొరడా ఝులిపిస్తున్నట్లు ఎస్పీ శర్మ తెలిపారు. ప్రధాన కూడళ్లలో విరివిగా తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్లు ధరించకుండా వాహనాలను నడిపే వారిపై కేసుల నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం కింద వసూళ్లు చేసి వారికి హెల్మెట్లు కూడా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విష్ణుచరణ్ పాత్రో, ఎస్‌డీపీఓ రస్మిరంజన్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

అపోహలు వీడండి

- మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఛైర్మన్ శ్రీనివాసరావు



మైత్రీ ఛైర్మన్ శ్రీనివాసరావు, సీఈఓకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాయగడ: అపోహలు వదిలి.. ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి బాటలు వేయాలని మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఛైర్మన్ శ్రీనివాసరావు హితవు పలికారు. జిల్లాలోని కాసీపూర్ సమితి సుంగేరు, సగాబలి ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం పర్యటించిన ఆయన.. ఆ ప్రాంత ప్రజలతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కర్మాగారాలు ఏర్పాటైతే ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధితో పాటు ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. అయితే కొంతమంది కాసీపూర్ ప్రాంతంలోని ఖనిజ సంపదను కర్మాగారాల కోసం వినియోగిస్తే పర్యావరణం కలుషితం అవుతుందనే భయాందోళన సృష్టిస్తున్నారన్నారు. అటువంటి వారి మాటలు నమ్మకుండా ఖనిజ సంపద వినియోగానికి సహకరించాలని కోరారు. కొద్ది నెలల క్రితం కాసీపూర్ సమితి పరిధిలోని కొటూరమాలి, సిజమాలి ప్రాంతాల్లో బాక్సైట్ నిక్షేపాలను ప్రభుత్వం ఆదాని, వేదాంత్ వంటి బృహత్తర కర్మాగారాలకు లీజు కింద మంజూరు చేసిందన్నారు. ఈ క్రమంలో బాక్సైట్ నిక్షేపాలను తవ్వి, తీసుకుపోతే తమ ప్రాంతంతో పర్యావరణం సమతుల్యం దెబ్బతింటుందని అమాయక ఆదివాసీలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందంటే, తామెందుకు అడ్డు చెబుతామని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామస్తులు కంపెనీ యజమాన్యానికి ఘనంగా స్వాగతం పలికారు. సీఈఓ ఎస్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీకి 117 పోస్టులు



వర్సిటీలో క్లాస్ వర్క్

- రెగ్యులర్ ప్రాతిపదికన బోధకులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు
- కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూల్లో వెయిటేజీ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ప్రాతిపదికన బోధకులను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం రెగ్యులర్ బోధకులు లేకపోవడంతో నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపు పొందిన సంస్థల నుంచి గ్రేడ్లు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో త్వరితగతిన పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది..

వర్సిటీ ఏర్పాటయ్యాక ఏడుగురే..

2008 జూన్ 28న అంబేడ్కర్ యూనివర్సిటీ ఏర్పాటైంది. ఆంధ్రా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కొనసాగిన పీజీ సెంటర్‌లో పనిచేసిన అధ్యాపకుల్లో 34 మంది రెగ్యులర్ బోధన సిబ్బంది వర్సిటీ ఏర్పాటు సమయంలో ఏయూకు వెళ్లిపోయారు. ఐదుగురు మాత్రమే ఇక్కడ ఉండేందుకు ఆప్షన్ ఇచ్చుకున్నారు. 2009లో సోషల్ వర్కు, బయోటెక్నాలజీ విభాగాలు ప్రారంభించారు. బయోటెక్నాజీలో నలుగురు, సోషల్ వర్కులో ముగ్గురు చొప్పున రెగ్యులర్ బోధకులను నియమించారు. ఈ ఏడు పోస్టులను మాత్రమే విశ్వవిద్యాలయం ఏర్పాటయ్యాక నియామకాలు చేపట్టడం గమనార్హం. ఐదేళ్ల టీడీపీ పాలనలో ఒక్క పోస్టును సైతం నియమించలేదు.

రెగ్యులర్ సిబ్బంది తప్పనిసరి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ బోధకులు ఎంతో అవసరం. నాక్, ఎన్‌బీఏ వంటి గుర్తింపులకు ఉన్నత గ్రేడులు పొందేందుకు రెగ్యులర్ బోధకులు లేక పోవటం ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో 21 పీజీ కోర్సులు, ఇంజినీరింగ్ కళాశాల నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా సమీకృత డిగ్రీ కోర్సు ప్రారంభిస్తున్నారు. నాలుగేళ్ల డిగ్రీ బీఎస్‌ఈ బీఎడ్‌లో 50, బీఏ బీఎడ్‌లో 50 సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. నూతన జాతీయ విద్యావిధానం నేపథ్యంలో ఈ కోర్సుకు సైతం రెగ్యులర్ పోస్టులు నియమించనున్నారు. సివిల్, మెకానికల్, ట్రిపుల్‌ఈ, సీఎస్ఈ, ఈసీఈ బ్రాంచ్‌లలో బ్రాంచ్‌కు 66 చొప్పున సీట్లు ఉన్నాయి. ఎంకాం, ఎకనామిక్స్, ఇంగ్లీష్, ఎంఎల్ఐఎస్సీ, సోషల్ వర్కు, తెలుగు, రూరల్ డెవలప్‌మెంట్, ఎంఈడీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలాటికల్ కెమిస్ట్రీ, మ్యాథ్స్, అప్లయిడ్ మ్యాథ్స్, ఫిజిక్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ప్రత్యేక బీఎడ్ మెంటల్లీ రిటార్డ్ కోర్సులు ఉన్నాయి. ప్రస్తుత నియామకాల్లో తెలుగు, యోగా అండ్ ఫిట్‌నెస్, ఎంజేఎంసీ, ప్రత్యేక బీఎడ్, ఎంఎడ్‌కు పోస్టులు లేవు. కనీస ప్రవేశాలు లేని కోర్సులకు కాకుడా అవసరమైన సబ్జెక్టుకు మాత్రమే పోస్టులు మంజూరు చేస్తారు.

స్క్రీనింగ్ టెస్టు..

పోస్టులు నియామకాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సోషల్ వెల్ఫేర్ సంస్థ రోస్టర్ సిద్ధం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో అర్హత సాధించిన వారికి విశ్వవిద్యాలయం ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. మొత్తం 117 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. రిజర్వేషన్ రోస్టర్, ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ విభజనపై అధికారులు దృష్టి పెట్టారు. ఈ నెలలో నోటిఫికేషన్, సెప్టెంబర్‌లో ఆన్‌లైన్ పరీక్షలు, అక్టోబర్‌లో ఫలితాలు, అనంతరం ఇంటర్వ్యూలు పూర్తిచేసి నవంబర్ నాటికి నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

10 శాతం వెయిటేజీ..

ప్రస్తుతం విశ్వవిద్యాలయం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లపై ఆధారపడి పనిచేస్తోంది. మొత్తం 65 కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 30 అతిథి బోధకులతో విద్యా బోధన కొనసాగుతోంది. కాంట్రాక్టు సిబ్బంది సేవలను దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్ పోస్టుల నియామకాల్లో వీరికి ఇంటర్వ్యూలో వెయిటేజ్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. గరిష్టంగా పది మార్కులు ఇస్తారు. సర్వీస్ ఆధారంగా ఏడాదికి ఒక మార్కు చొప్పున కేటాయిస్తారు. దీంతో అర్హత, ప్రతిభ ఉన్న కాంట్రాక్టు బోధకులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఏడుగురు మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. ఎకనామిక్స్, బయోటెక్నాలజీలో ఒక్కొక్కరు, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సోషల్ వర్కులో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. సోషల్ వర్కులో గతంలో ముగ్గురు రెగ్యులర్ సిబ్బంది ఉండగా, ఒకరు కరోనా సమయంలో మృతి చెందారు. బయోటెక్నాలజీలో నలుగురురిలో ఇద్దరు ఏయూకు డిప్యుటేషన్ పెట్టుకున్నారు.

విద్యా బలోపేతం



ప్రస్తుతం వర్సిటీకి రెగ్యులర్ సిబ్బంది కొరత ప్రధాన సమస్య. ప్రతి విభాగం బలోపేతం కావాలంటే రెగ్యులర్ సిబ్బంది అవసరం. ప్రభుత్వం రెగ్యు లర్ పోస్టుల నియామకానికి అనుమతులు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో విద్య బలోపేతం అవుతుంది. కాంట్రాక్టు సిబ్బందికి వెయిటేజ్ ఇవ్వటం వల్ల వారికి సైతం ప్రయోజనం ఉంటుంది.

– ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వైస్ చాన్సలర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వెయిటేజ్ వినియోగించుకుంటాం



కాంట్రాక్టు సిబ్బందికి ఇంటర్వ్యూలో వెయిటేజ్ ఇవ్వటం మంచి అవకాశం. రిక్రూట్‌మెంట్‌లో ప్రయోజనం ఉంటుంది. కొన్నేళ్లగా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నాం. కాంట్రాక్టు సిబ్బంది మీద ఆధార పడి ఈ విశ్వవిద్యాలయం కొనసాగుతుంది. వెయిటేజీను సద్వినియోగం చేసుకుంటాం.

– డాక్టర్ అరసవెల్లి ఆనంద్‌మోహన్, కెమిస్ట్రీ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయవాదులకు, జిల్లా కోర్టు ఉద్యోగులకు ఆటలు శారీరక ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అహ్మద్ మౌలానా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో శనివారం శాంతినగర్‌కాలనీలో ఉన్న స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యారావు మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఆటల పోటీలు 14 వరకు కొనసాగుతాయని చెప్పారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, సీనియర్ న్యాయవాదులు గేదెల వాసుదేవరావు, జి.లక్ష్మి, బైరి దామోదరరావు, సనపల హరి, స్పోర్ట్సు కార్యదర్శి గంగు భాస్కరరావు, పైడి విశ్వేశ్వరరావు, హరి ప్రియ, జి.అనిల్‌కుమార్, ఆర్.కుసుమ, మజ్జి సుధాబాల, గొద్దు భాగ్యలక్ష్మి, కె.సత్యవాణి, పి.పద్మజ, ఎస్.శాంతకుమారి, పైడి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా వంశధార పనులు పూర్తి



వంశధార రిజర్వాయర్ పనుల ప్రగతిపై చర్చిస్తున్న చీఫ్ ఇంజినీర్లు

హిరమండలం: వంశధార రిజర్వాయర్ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామని సీడీఓ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ యాదవ్, క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజనీర్ పుల్లారావు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకర్‌రావు అన్నారు. శనివారం నేరడి సమీపంలోని సైడ్‌వీర్ 87, 88 ప్యాకేజీలతో పాటు వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులు, వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులు పరిశీలించారు. అనంతరం వంశధార అతి గృహంలో ఇంజినీరింగ్ అధికారులతో పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.ప్ర ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వం ఇటీవల ప్రత్యేక సమీక్ష నిర్వహించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం 87ప్యాకేజీ 92 శాతం, 88 ప్యాకేజీ 94శాతం, హైలెవల్ కెనాల్ 70 శాతం, వంశధార రిజర్వాయర్ పనులు 94 శాతం మేర పనులు పూర్తయినట్లు వివరించారు. మిగిలిన పనులు పూర్తి చేసి డిసెంబర్‌నాటికి జాతికి అంకితం చేస్తామన్నారు. అనంతరం రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్ ప్రతినిధి నాగేశ్వరరావుతో సమీక్ష జరిపారు. ఇప్పటివరకు ఎత్తిపోతల పథకానికి సంబంధించి తయారీ, ప్రతిపాదనలు, డిజైన్‌లు, ఇతర అంశాలకు సంబంధించి అనుమతులు రాకపోవడం వల్లే పనుల్లో జాప్యం జరిగిందన్నారు. ఇటీవల అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు, ఈఈలు రామచంద్రరావు, ఎస్.వి.రమణ, సీతంనాయుడు, రవీంద్ర, త్రినాథరావు డీఈఈలు సురేష్, రవికాంత్ ఏఈలు, జేఈలు వంశధార సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిశీలన..

కొత్తూరు: వంశధార ప్రాజెక్టులో భాగంగా పారాపురం వద్ద నిర్మిస్తున్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ పుల్లారావు పరిశీలించారు. పనుల వివరాలను వంశధార ఎస్ఐ డోల తిరుమలరావు వివరించారు. పనులు నాణ్యతతో ఉండాలని సీఈ సూచించారు. రిజర్వాయర్ పనులతో పాటు వరద కాలువ పనులను ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌బాబు వివరించారు. పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ఉన్న మిగులు భూములకు సాగునీటి కోసం రిజర్వాయర్ వద్ద ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని గూనభద్రకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కె.వైకుంఠరావుకు ఇంజినీరింగ్ అధికారులను కోరారు.

బాలింత మృతి పట్ల ఆందోళన



మాట్లాడుతున్న డీసీహెచ్ఓ భాస్కరరావు

సారవకోట: వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి చెందిందంటూ సారవకోట మండలం బుడితి ఆస్పత్రి వద్ద శనివారం జలుమూరు మండలం చెన్నాయివలస గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వివరాలకు వెళ్తే.. చెన్నాయివలసకు చెందిన కావేటి రాము, దేవుడమ్మల కుమార్తె విష్ణుపాత్రుని శిరీష(22)కు గార మండలం బోరవానిపేట గ్రామానికి చెందిన మణివర్మతో వివాహం జరిగింది. మొదటి కాన్పు కోసం శిరీషను స్వగ్రామానికి తీసుకొచ్చారు. నెలలు నిండటంతో గత నెల 24న బుడితి సీహెచ్‌సీలో చేర్పించారు. సాధారణ ప్రసవానికి అవకాశం లేకపోవడంతో 25న సిజేరియన్ చేయగా పాపకు ప్రసవించింది. ఆ సమయంలో బ్లీడింగ్ ఎక్కువ కావడంతో మూడు బాటిళ్ల రక్తం ఎక్కించారు. సాధారణ స్థితికి వచ్చినప్పటికీ రిమ్స్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో జెమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బుడితి సీహెచ్‌సీ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఆపరేషన్ వికటించడం వల్లే శిరీష మృతిచెందిందంటూ మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అప్పారావు బాధితులను వారించే ప్రయత్నం చేసినా ఫలితం లేక పోయింది. అనంతరం డీసీహెచ్ఓ భాస్కరరావు ఆసుపత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. జెమ్స్‌లో చేరిన తర్వాత పలు రకాల కాంప్లికేషన్లు రావడంతో శిరీషమృతి చెంది ఉంటుందన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై తీసుకుంటామన్నారు. మారుమూల గ్రామంలోని ప్రభుత్వాసుపత్రులలో రక్తం ఎక్కించి సిజేరియన్లు చేయడం గొప్ప విషయమని, అటువంటి ఆస్పత్రులపై తప్పులు నెట్టి ఆందోళన చేయడం సరికాదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సృజనీకుమారి, నాయకులు నక్క తులసీదాస్, నిక్కు రాజశేఖర్, మాజీ సర్పంచ్ సారవకోట రామారావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8 వరకు సచివాలయం నుంచి రాష్ట్రస్థాయిలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు జరగనున్నాయని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. విన్నర్లకు స్పోర్ట్స్ కిట్లు ఇస్తామని ఆయన తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం కమిటీ ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 30 మండలాల్లో, 8 నియోజకవర్గాల్లో గ్రౌండ్స్ మ్యాపింగ్ చేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు ప్రధాన పాత్ర వహించాలన్నారు. మండలం, నియోజకవర్గం స్థాయిలో భోజన సౌకర్యాలకు ముందస్తు చర్యలు చేపట్టాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా ఉంటారని తెలిపారు. అన్ని జూనియర్ కళాశాలలకు, డిగ్రీ కళాశాలలకు సమాచారం అందజేయాలని సూచించారు. సెట్‌శ్రీ సీఈఓ ప్రసాద రావు మాట్లాడుతూ గ్రామ సచివాలయం నుంచి అంచెలంచెలుగా రాష్ట్రస్థాయి వరకు పోటీలు ఉంటాయని, ప్రతి దశలోనూ నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. స్టేట్ లెవల్ పోటీలు నవంబరు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నంలో ఉంటాయన్నారు. నగదు బహుమతి, ట్రోఫీలు 8వ తేదీ ముఖ్యమంత్రి చేతులమీదుగా అందిస్తారన్నారు. ఈ పోటీలకు 17 ఏళ్లు దాటిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు లో, మస్కట్ పోటీలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులు వారు తయారు చేసిన మస్కట్లు, లోగోను పంపించాలని విజేతలకు బహుమతులు ఇస్తామని ప్రకటించారు. ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనే వాళ్లు ఏ సచివాలయం పరిధిలో నివసిస్తున్నారో, వారు ఆ సచివాలయ పరిధిలోని ఆడాల్సి ఉంటుందని, ఇది సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



సప్ప అనూరాధ (ఫైల్)

పాతపట్నం: మండలంలో కొరసవాడ పెద్దవీధికి చెందిన సప్ప అనూరాధ (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిందని సోదరుడు కిక్కర షణ్ముఖరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అనూరాధ, మల్లేసులు భార్యాభర్తలు. తాపీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన మల్లేసు నిత్యం మందుతాగి వచ్చి భార్యను కొడుతుండేవాడు. ఈ నెల 4న రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. శనివారం ఉదయం చూసేసరికి మంచానికి చీర కట్టి ఆత్మహత్య చేసుకుందని భర్త మల్లేసు గ్రామస్తులకు తెలిపాడు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళుతుండగా ఎస్ఐ మహమ్మద్ యాసీన్ వచ్చి అడ్డుకున్నారు. మృతురాలి సోదరుడు షణ్ముఖరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం చేయాల్సి ఉందని చెప్పి సీహెచ్‌సీకి తరలించారు. అనూరాధకు ముగ్గురు కుమార్తె జ్ఞానేశ్వరి, మేఘన, తేజశ్వరీ ఉన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ఒక కుటుంబం.. రూ.7.91 లక్షల ప్రయోజనం

ఈ చిత్రంలో ఉన్నది పట్నాన శంకరరావు, లక్ష్మి కుటుంబం. నరసన్నపేట మేజర్ పంచాయతీ కలివరపుపేట వీధిలో నివాసముంటున్నారు. వీరికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏకంగా రూ.7.91 లక్షల ప్రయోజనం కలిగింది. శంకరరావుకు వాహన మిత్ర, భార్య లక్ష్మికి వైఎస్సార్ ఆసరా, తల్లి అన్నపూర్ణకు పింఛన్, కుమారుడు కమలకుమార్‌కు జగనన్న విద్యాదీవెన, కుమార్తె చంద్రికకు జగనన్న వసతి దీవెన పథకాలు వర్తించాయి. ఇంటి స్థలం, నిర్మాణానికి నిధులు సైతం మంజూరయ్యాయి. ఇచ్ఛాపురం నుంచి నరసన్నపేటకు వలస వచ్చామని, ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకుంటున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

-నరసన్నపేట

క్లుప్తంగా

డాక్టర్ బీఎస్సార్ మూర్తి ఇక లేరు

- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు
- పలువురి సంతాపం



డాక్టర్ బీఎస్సార్ మూర్తి (ఫైల్)

గజపతినగరం: వైద్యరంగంలో విశిష్ట సేవలందించి వేలాది మందికి ఆయువు పోసిన డాక్టర్ బీఎస్సార్ మూర్తి (83) శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తనువుచాలించారు. విజయనగరం జిల్లా ప్రేమసమాజం అధ్యక్షుడిగా, స్కాట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, చైతన్య భారతి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, విశాఖపట్నం లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్‌గా, లయన్స్ పూర్వ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారు. ఆయన కుమారుడు డాక్టర్ నాగనరేంద్ర మృతి చెంది ఏడాదిన్నర గడవకుముందే బీఎస్సార్ మృతితో కుటుంబ సభ్యుల శోకసంద్రంలో మునిగిపోయారు. గజపతినగరంలో విషాదం అలముకుంది. బీఎస్సార్ ఇద్దరు కుమార్తెల్లో డాక్టర్ పావని డెంటిస్ట్‌గా, అల్లుడు జి.వి.వెంకట్ ఈఎన్‌టీ స్పెషలిస్ట్‌గా సేవలందిస్తున్నారు. రెండవ కుమార్తె సాయిపద్మ విశాఖపట్నంలో సంఘసేవకురాలిగా గుర్తింపుపొందారు. బీఎస్సార్ భౌతిక కాయానికి ఆదివారం గజపతినగరంలో అంత్యక్రియలు జరపనున్నారు.

ప్రగాఢ సంతాపం

డాక్టర్ బీఎస్సార్ మూర్తి ఆత్మకు శాంతి కలగాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, జెట్పీటీసీ సభ్యుడు గారతవుడు, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, పార్టీ మండలాధ్యక్షుడు బూడి వెంకటరావు, మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణతో పాటు చైతన్య భారతి కార్యదర్శి బొంతల కోటి శంకరరావు, పలువురు నాయకులు, సర్పంచ్‌లు, లయన్స్ సిబ్బంది, వైద్యులు సంతాపం తెలిపారు. అందరికీ సుపరిచితుడైన వైద్యుడి మృతిపై విచారం వ్యక్తంచేశారు.

నేడు ఏపీయూడబ్ల్యూజే 26వ మహాసభలు

- హాజరుకానున్న మంత్రి బొత్స

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా శాఖ 26వ మహాసభలు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరగనున్నట్టు జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.శేషగిరి, పంచాది అప్పారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హాజరవుతారన్నారు. విశిష్ట అతిథులుగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఆత్మీయ అతిథిగా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి హాజరవుతారని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు పాలకపాటి రఘువర్మ, డాక్టర పి.సురేష్‌బాబు, రఘురాజు, వేపాడ చిరంజీవి తదితరుల పాల్గొంటారన్నారు. మహాసభల సందర్భంగా 'సోషల్ మీడియా- తీరు తెన్నూ' అనే అంశంపై జరిగే సదస్సుకు ప్రధాన వ్యక్తగా రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ పాల్గొంటారన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా తదితరులు సదస్సులో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం జరిగే ఉత్తరాంధ్ర యూనియన్ ప్రతినిధుల సమావేశంలో ఉత్తరాంధ్రా జిల్లా సీనియర్ జర్నలిస్టులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మీ భవిత మా బాధ్యత

శ్రీకాకుళం రూరల్: ఐటీసీఎల్ పైప్‌లైన్‌కు భూములిచ్చిన రైతుల పిల్లల భవితను తీర్చిదిద్దడం తమ బాధ్యతని ఐటీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్‌కుమార్ వాసుదేవన్ అన్నారు. శనివారం రాగోలు జెమ్స్‌లో బొల్లినేని మెడిస్కిల్‌ను సందర్శించారు. ముందుగా విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్న ఫార్మసీ అసిస్టెంట్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. రైతులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి పిల్లలకు ఉజ్వల భవిష్యత్ కల్పించే దిశగా కృషి చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని పంట పొలాల్లో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని సుమారు 65 సంవత్సరాల వయసు గల వ్యక్తి పడిపోయాడు. దీన్ని గుర్తించిన పోలీసులు సపర్యలు చేసి ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు హెచ్‌సీ పాపారావు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం పెద్దాస్పత్రిలో ఉంచామని తెలిపారు. మృతుడు గెడ్డంతో పాటు ఆఫ్ ప్యాంట్ వేసుకొని ఉన్నాడని చెప్పారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ▸ మా లక్ష్యం

- రూ.500 కోట్లతో 70 ఎకరాల్లో విజయనగరంలో వైద్యకళాశాల నిర్మాణం
- పనులు సంతృప్తికరంగా సాగుతున్నాయి
- సెప్టెంబర్‌లో విజయనగరం నుంచే ఐదు మెడికల్ కళాశాలలు సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం
- జీరో వెకెన్సీతో 50 వేల పోస్టుల భర్తీ
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని
- వైఎస్సార్, జగన్‌ల హయాంలోనే 19 వైద్య కళాశాలలు: మంత్రి బొత్స
- గాజులరేగ వద్ద నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలను పరిశీలించిన మంత్రులు



విజయనగరం వైద్య కళాశాల పనులను పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖమంత్రి విడదల రజని, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జేసీ అశోక్ తదితరులు



గాజులరేగలో తుదిదశలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం



వైద్య కళాశాలలో ల్యాబ్‌ను పర్యవేక్షిస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం ఫోర్ట్:

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అన్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, దీనికోసం నిరంతరం పరితపిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని పేర్కొన్నారు. విజయనగరంలోని గాజులరేగ వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాస్‌రావుతో కలిసి శనివారం పరిశీలించారు. ఎనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ, స్కిల్ ల్యాబ్, యుటిలిటీ ల్యాబ్, హాస్టల్స్, రోడ్లు, తాగునీటి సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి రజని మాట్లాడుతూ వైద్య కళాశాల నిర్మాణ పనులు సంతృప్తికరంగా, శరవేగంగా సాగుతున్నాయన్నారు. పెండింగ్ పనులను నిర్దేశిత గడువు పెట్టుకుని పూర్తిచేస్తున్నట్టు వివరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే విజయనగరం, నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం, రాజమండ్రి వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతాయని స్పష్టంచేశారు. విజయనగరం జిల్లా నుంచే సీఎం జగన్‌మోహన్ రెడ్డి సెప్టెంబర్ నెలలో వైద్య కళాశాలలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఐదు వైద్య కళాశాలల్లో 750 సీట్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఉత్తరాంధ్రలో విజయనగరంతో పాటు పాడేరు, పార్వతీపురంమన్యం, నర్సీపట్నంలలో వైద్య కళాశాలలు నిర్మిస్తామని చెప్పారు. విజయనగరం జిల్లాలో రూ.500 కోట్ల ఖర్చుతో 70 ఎకరాల్లో వైద్య కళాశాల నిర్మాణం జరుగుతుందన్నారు. ఎంబీబీఎస్ విద్య విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందన్నారు. వైద్య రంగంలో ముఖ్యమంత్రి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందాలన్నదే సీఎం అభిమతమన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 3,257 వ్యాధులకు ఉచిత చికిత్స అందిస్తున్నట్టు వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు వెల్లడించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. జీరో వెకెన్సీకింద 50 వేల పోస్టులను భర్తీచేసి ముఖ్యమత్రి జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.16 వేల కోట్లతో ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. కొత్త వైద్య కళాశాలలు సొంతంగా, ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో కొన్ని సీట్లు భర్తీ చేస్తున్నట్టు స్పష్టంచేశారు. గత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలకూడా ఏర్పాటుచేసే ఆలోచన చేయలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి మాత్రం వైద్యవిద్యకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు నడుంబిగించారన్నారు. ప్రజలు సంతోషంగా ఉండడం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు నచ్చదన్నారు.

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినతర్వాత రాష్ట్రంలో 11 వైద్య కళాశాలలు ఏర్పాటైతే, అందులో రెండు కళాశాలలను మహానేత వై.ఎస్.రాజశేఖర రెడ్డి ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయన తనయుడు ఇప్పుడు 17 కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని, మొత్తంగా 19 వైద్య కళాశాలలు తండ్రీ, కొడుకుల కృషితో సాకారమవుతున్నాయన్నారు. గతంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం మద్రాస్, హైదరాబాద్ వెళ్లేవారమని, కొంతకాలంగా విశాఖపట్నం వెళ్తున్నామని, ప్రస్తుతం విజయనగరంలోనే ఆ సేవలు అందుతున్నాయని చెప్పారు. వైద్య కళాశాల నిర్మాణ పనులపై సీఎం జగన్ మోహన్ రెడ్డి నెలలో రెండు సార్లు సమీక్షిస్తున్నారన్నారు. వైద్య రంగంలో ఆయన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మన్యం ప్రాంతంలో వైద్య కళాశాలలు వస్తాయని ఎవరైనా ఊహించారా? దానిని కూడా జగన్‌మోహన్ రెడ్డి సుసాధ్యంచేశారని చెప్పారు. ప్రజలకు మంచి చేయాలన్న తలంపుతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వం అభిమతంగా పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వైద్య కళాశాల సాధన, ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు పూర్తిగా విఫలమయ్యారన్నారు. వైఎస్సార్ హయాంలో జేఎన్‌టీయూ, ప్రభుత్వ జూనియర్ వైద్య కళాశాల తీసుకొచ్చామని, ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి హయాంలో జేఎన్‌టీయూను వర్సిటీగా స్థాయి పెంచారని, ప్రభుత్వ వైద్య కళాశాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఇక్కడి వైద్యకళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు 150 ఎంబీబీఎస్ సీట్లలో ప్రవేశాలకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఏపీఎంఎస్ఐడీసీ ఎం.డి డి.మురళీధర్ రెడ్డి, జేసీ మయూర్ అశోక్, వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరసింహారావు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఎ.రమణి, ఏపీఎంఎస్ ఐడీసీ ఈఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విక్రయశాల ప్రారంభం



జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మిల్లెట్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు రజని, బొత్ససత్యనారాయణ, తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య ఏర్పాటు చేసిన చిరుధాన్యాల (మిల్లెట్స్) విక్రయశాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని శనివారం ప్రారంభించారు. ఈ విక్రయశాలలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఉత్పత్తులను మంత్రులు పరిశీలించారు. అనంతరం పక్కనే ఏర్పాటు చేసిన గెటోస్ కేఫ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డీఆర్వో ఎం.గణపతిరావు, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, జెడ్పీ సీఈఓ కె.రాజ్ కుమార్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, డీఆర్‌డీఏ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

విజయనగరం: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సంఘ సాధారణ సమావేశంలో భాగంగా నిర్వహించిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా బి.శేఖర్, ప్రధాన కార్యదర్శిగా వి.మల్లేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.కాళిదాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్.గోపీకృష్ణ, విజయనగరం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.వేణుగోపాలరావు పర్యవేక్షించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించిన వారు... జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

'ఏపీఎల్' – 2లో జిల్లా క్రీడాకారులు

- వివిధ ఫ్రాంఛైజీలకు 12 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం



పి.తపస్వి



పి.తేజస్వి



జె.దుర్గాకుమార్



ఎం.రవికిరణ్



వై.వాసు



టి.దీపుభార్గవ్

విజయనగరం రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న ఆంధ్రా ప్రిమియం లీగ్ సీజన్ – 2లో జిల్లాకు చెందిన 12 మంది క్రికెట్ క్రీడాకారులను వివిధ ఫ్రాంఛైజీలు వేలం పాటలో దక్కించుకున్నాయని విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు శనివారం తెలిపారు. ఏసీఏ ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నంలో క్రీడాకారుల ఎంపికకు వేలం పాట నిర్వహించగా జిల్లాకు చెందిన పిన్నింటి తపస్వి (ఉత్తరాంధ్ర లయన్స్), పిన్నింటి తేజస్వి, యడ్ల వాసు, యర్రా పృథ్విరాజ్, గుల్ఫామ్ సాలేహ్, ఎన్.నివాస్‌లను ఉత్తరాంధ్ర లయన్స్ ఫ్రాంఛైజీ కొనుగోలు చేసింది. జరజాపు దుర్గాకుమార్, కె.సతీష్‌లను బెజవాడ టైగర్స్ కొనుగోలు చేయగా మోపాడ రవికిరణ్, టి.దీపుభార్గవ్, కనకరాజులను వైజాగ్ వారియర్స్ కొనుగోలు చేసింది. ఎం.ధీరజ్‌కుమార్‌ను గోదావరి టైటాన్స్ కొనుగోలు చేసింది. ఏపీఎల్‌కు ఎంపికైన క్రీడాకారులను కార్యదర్శితో పాటు ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలక్టర్లు, కోచ్‌లు, జిల్లా క్రికెట్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 30 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. అక్కడ పరిసర ప్రాంతాల్లో విచారణ చేసిన పోలీసులు అతను ఒక యాచకుడని గుర్తించారు. అయితే అతని కుటుంబ సభ్యులు ఎవరైనా గుర్తిస్తే తమను సంప్రదించాలని వన్‌టౌన్ ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

విజయనగరం క్రైమ్: స్థానిక గాజులరేగ జంక్షన్ వద్ద శనివారం ఆటోలో తరలిస్తున్న 752 కిలోల పీడీఎస్ బియ్యాన్ని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న అప్పలనాయుడును అదుపులోకి తీసుకున్నారు. ఆటో సీజ్ చేశామని, బియ్యాన్ని ఎంఆర్‌వోకు అప్పగించినట్లు టూటౌన్ ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

ఎస్ఆర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ రేపు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగు సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 7న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత వివరాలు విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్‌లో చూసుకోవాలన్నారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

సందడి చేసిన 'బేబీ' చిత్ర యూనిట్



ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరోయిన్ వైష్ణవి, చిత్రంలో హీరో విరాజ్ అశ్విన్ తదితరులు

విజయనగరం టౌన్: విజయనగర ప్రజల అభిమానం మరిచిపోలేనిదని బేబీ చిత్ర యూనిట్ పేర్కొంది. స్థానిక కృష్ణ థియేటర్‌లో శనివారం చిత్ర యూనిట్ సందడి చేసింది. విజయోత్సవ యాత్రలో భాగంగా జిల్లాకు వచ్చిన హీరోలు ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, హీరోయిన్ వైష్ణవి చైతన్య, నిర్మాత ఎస్‌కేఎన్‌కి థియేటర్ యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిత్ర బృందం మాట్లాడుతూ బేబీ చిత్రం ఇంతటి ఘన విజయం సాధిస్తుందని ఊహించలేదన్నారు. సినిమా విజయానికి సహకరించిన ప్రతి ప్రేక్షకునికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి క్యారెక్టర్‌కి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. మరిన్ని మంచి చిత్రా లతో అలరిస్తామన్నారు. సినిమాలో పలు డైలాగ్స్‌ను చెప్పి ప్రేక్షకులను అలరించారు. అనంతరం మీడియాతో హీరో విరాజ్ అశ్విన్ మాట్లాడుతూ విజయనగరంతో తనకు చిన్నప్పటి నుంచి అనుబంధం ఉందన్నారు. ఇక్కడ ఉండడం వలన ప్రతీ ఏడాది వస్తుంటానని తెలిపారు. బేబీ చిత్రం వలన తన మైలేజ్ బాగా పెరిగిందని, ప్రస్తుతం రెండు చిత్రాలు పూర్తయ్యాయని, తొందరలోనే విడుదల అవుతాయన్నారు. రానున్న రోజుల్లో విజయనగరంలో తన సినిమాలు షూటింగ్ జరిగేలా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా హీరో విరాజ్ అశ్విన్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు అవనాపు విక్రమ్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ థియేటర్ అధినేత భార్గవ్ ఏజెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, చిత్రంలో మంత్రి బొత్స తదితరులు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

విజయనగరం అర్బన్: అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అధికారులను ఆదేశించారు. బిల్లులు పెండింగ్ లేకుండా వెంట వెంటనే చెల్లించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం రాజాం నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో జరుగుతున్న ప్రాధాన్యత, ప్రాధాన్యతేతర పనులు, గడప గడపకు మన ప్రభుత్వం, వైద్యారోగ్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం వారీగా సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం మెరుగు పరిచేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసే ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో అధికారులు ఎక్కడా రాజీ పడొద్దని అన్నారు. ఏ సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, గృహ నిర్మాణానికి వాగులు, వంకలు తదితర థర్డ్ ఆర్డర్ రీచ్‌ల్లో దొరికే ఇసుక అలాగే మట్టి, గ్రావెల్‌ను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ నిర్ణయమని ఈ విషయంలో ఎక్కడా అభ్యంతరాలు పెట్టకూడదని అధికారులను ఆయన ఆదేశించారు. అయితే ఇలాంటి చోట ఇసుక తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ యంత్రాలను ఉపయోగించకూడదని మంత్రి స్పష్టం చేశారు. గడప గడపకు పనుల ద్వారా గ్రామాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోందని నియోజకవర్గానికి సుమారు రూ.20 కోట్లు వెచ్చించి పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తిన పలు అంశాలపై రాష్ట్ర ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అప్పటికప్పుడే వారి సమస్యలను మంత్రి పరిష్కరించారు. అసంపూర్తిగా వదిలేసిన పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని లేని చోట కొత్తగా మండలానికి రూ.60 లక్షలు విలువైన పనులను ప్రతిపాదించాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పంటకు ఈ క్రాప్ నమోదు చేయడం తప్పనిసరి అన్నారు. ఈ క్రాప్ జరిగే సమయంలో సంబంధిత రైతులు తప్పనిసరిగా అక్కడే ఉండాలని ఆయన సూచించారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ జిల్లాలో తమ నియోజకవర్గం కలిపిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకున్నాయని చెప్పారు. ప్రస్తుతం పలు రోడ్లను విస్తరిస్తున్నామన్నారు. పాలకొండ ఉల్లివలస, నారాయణపురం, సంతకవిటి – రాజాం తదితర రోడ్లను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, డీఆర్‌వో ఎం.గణపతిరావు, సీపీవో పి.బాలాజీ, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, వివిధ శాఖల అధికారులు, రాజాం నియోజకవర్గ పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు, వైద్య, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

తోటపల్లి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు



వీరఘట్టం మండలం అచ్చెపువలస వద్ద నాగావళి ఎడమకాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు, క్వాలిటీ కంట్రోల్ సీఈ పుల్లారావు, తదితరులు

- జలవనరులశాఖ నార్త్‌కోస్ట్ చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు

వీరఘట్టం: తోటపల్లి ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమకాలువల పరిధిలోని పాత ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని జలనరులశాఖ నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు తెలిపారు. వీరఘట్టం, గరుగుబిల్లి, పాలకొండ, జియ్యమ్మవలస మండలాల్లోని కుడి, ఎడమకాలువల్లో నీటి ప్రవాహాన్ని పలు ప్రాంతాల్లో శనివారం పరిశీలించారు. ఆయకట్టు శివారు భూములకు సాగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువ ఎగువ భాగంలో రైతులు పూనులు వేయకుండా చూడాలన్నారు. అనుమతిలేకుండా మదుములు ఏర్పాటు చేస్తే వాటిని మూసివేసి తొలుత శివారుకు నీరు వెళ్లేలా చూడాలన్నారు.

పనుల పరిశీలన

తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు రూ.193.58 కోట్ల వ్యయంతో చేపడుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 37.536 కి.మీలు పొడవున్న ఎడమకాలువలో ఇంతవరకు పూర్తయిన 16.843 కి.మీ కాంక్రీట్ పనులను, 17.616 కి.మీ పొడవున్న కుడికాలువలో పూర్తయిన 9.376 కి.మీ కాంక్రీట్ పనులను, పలు చోట్ల నిర్మించిన బ్రిడ్జిలను క్వాలిటీ కంట్రోల్ సీఈ ఎస్.పుల్లారావు, ఎస్ఈ ఎస్.సాయిశ్రీనివాస్ యాదవ్ బాల, ఈఈ డోల తిరుమలరావు, డీఈఈ లక్ష్మి పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పరిశీలించారు. ఇంత వరకు చేపట్టిన పనుల వల్ల శివారు ఆయకట్టు వరకు సాగునీరు నిరాటంకంగా ప్రవహించడంపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు సంతృప్తి వ్యక్తంచేశారు. మిగులు పనులు వచ్చే ఏడాది మే నెలాఖరులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. పనులు చేపట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రమాణాలను వివరించారు. కార్యక్రమంలో డీఈఈ దమలపాటి రవికుమార్, ఏఈఈలు బి.శంకరరావు, డి.వి.రమణ పాల్గొన్నారు.